# గ్రూప్-1 ఉద్యోగాలు

- పదమూడేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర
- 2003లో మిగులు పోస్టులు
- మెరిట్ అభ్యర్థులతోనే వీటి భర్తీ
- సుప్రీం తీర్పు అమలుకు నిర్ణయం

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పదమూడేళ్ల నిరీక్షణ.. న్యాయపోరాటం ఫలించింది! 2003 గ్రూప్-1లో భర్తీ కాని 68 పోస్టులను రూల్-7 ప్రకారం మెరిట్ అభ్యర్థులతోనే భర్తీచేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలివ్వడంతో.. ఇందుకు అనుగుణంగా ఏపీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. ఫలితంగా 68 గ్రూప్-1 ఉద్యోగాలు నిరుద్యోగుల తలుపు తట్టను న్నాయి. ఇందులో 56 ఎంపీడీవో పోస్టులు ఉండగా, మిగిలినవి ఇతర పోస్టులు. సెలక్షన్ వచ్చినా జాయిన్ కాకపోవడంతో పాటు ఇతరత్రా కారణాలతో ఇవి భర్తీ కాలేదు. వీటిని రూల్-7 ప్రకారం అప్పటి మెరిట్ జాబితాలోని అభ్యర్థులతో భర్తీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2008లో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వీటి గురించి ప్రస్తావించని ఏపీపీఎస్సీ. 2011నాటి గ్రూప్-1 నోటిఫికేషన్‌లో వీటిలో కొన్నింటిని కలిపింది. మొత్తానికి... సుదీర్ఘ కాలం తర్వాత నిరుద్యోగులకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దీనిని అమలు చేయాలని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన నోటిఫికేషన్ కాబట్టి... ఈ పోస్టులను రెండు రాష్ట్రాల అభ్యర్థులతో భర్తీ చేయాల్సి ఉంటుంది.